

# చిట్టచివరి సున్నా...

భగవంతం

ఉ లిక్కిపడ్డాను-

ఆ ఇంగ్లీష్ న్యూస్‌పేపర్ లిటరరీ సప్లిమెంట్ పేజీ పై భాగంలో- ఎడంవైపు ఖాళీగా ఉన్నచోట- పచ్చ ఇంకు పెన్నుతో ఎవరో తెలుగులో రాసుకున్న ఆ వాక్యాలు చదివి...

ఉదయం వీధి చివరి కిరాణాకొట్లోంచి కొనుక్కొచ్చిన రెండు కిలోల మైదాపిండిని శ్రీమతి ప్లాస్టిక్ డబ్బాలోకి ఒంపాక- పొట్లంగా కట్టడానికి షాపు అతను ఉపయోగించిన ఆ న్యూస్‌పేపర్‌ని- ఏ కాగితమ్ముక్క దొరికినా చదవకుండా ఉండలేని అలవాటు ప్రకారం- రి...లా...క్స్...గా పడక్కుర్చీలో వెనక్కివాలి చదువుతోన్న నాకు ఆ పేపర్‌మీద రంగులకన్నా భిన్నంగా- ఒకపక్కగా రాసి ఉన్న ఆ వాక్యాలు- ఒక్క ఉదుటున ముందుకు లేచి- కుర్చీ అంచున కూర్చునేంత ఉత్కంఠను కలిగించాయి.

ఎవరో అనామకుడు- బహుశా తాను పూర్తి చేయాలనుకున్న పనులని లిస్ట్‌లాగా రాసుకున్న వాక్యాల్లా ఉన్నాయవి. ఇప్పటిదాకా నేను ఎక్కడా చదవని- చదివిన వారినెవ్వరినైనా కొంతయినా ఆలోచనకి గురిచేసే ఆ ఆకుపచ్చ వాక్యాల వరుస ఇలా ఉంది.

1. గదిలోని పుస్తకాలన్నింటినీ లైబ్రెరీకి డొనేట్ చేయాలి.

2. బ్యాంకు ఎకౌంట్ క్యాన్సిల్ చేసి ఆ డబ్బులన్నీ పనిమనిషి రంగమ్మకు ఇచ్చేయాలి.

3. ఇంటికి ఉత్తరం రాయాలి.

4. సూయిసైడ్ లెటర్ రాసి జేబులో పెట్టుకోవాలి.

5. జీవితసత్యాన్ని తెలిపే 'ఆ' పదార్థంతో పులుసు వండుకొని చివరిసారి తృప్తిగా భోంచేసి వెళ్లిపోవాలి.

అంతే... అంతవరకే రాసి ఉంది. రాసిన వ్యక్తి పేరుకానీ, సంతకంలాంటివికానీ ఏమీలేవు. పేపరంతా తిప్పితిప్పి చూశాను. ఇంకెక్కడా ఎలాంటి చేతిరాతా కనిపించలేదు. భలే సరదాగా అనిపించింది.

ఇదంతా ఒక వ్యక్తి నిజంగానే తన జీవితంలోని చివరి ఘడియల్లో రాసుకున్నదా...? లేక లిటరేచర్ పేజీలో రాసుకున్నాడు కాబట్టి రచయిత అయి ఉండి- తన రచనలో భాగంగా రఫ్ నోట్స్‌గా గాని రాసుకున్న వాక్యాలా...? లేక చదివినవాళ్లను ఏ ఏప్రిల్ ఫూలో చేయడానికి ఎవడైనా ఆకతాయి సరదాగా రాసిందా...?

చేతిరాత చూస్తోంటే మగవాడి రాతలాగే ఉంది. పైగా గుండ్రని- అందమైన అక్షరాలు. ఆత్మహత్య చేసుకోవాల్సినంత అగత్యం ఎందుకొచ్చిందో...? ఏదేమైనా- రాసినవాడు ఏ ఉద్దేశ్యంతో రాసాడోకానీ- ఒక వాక్యాన్ని మించి మరో వాక్యం భలే ఉత్సుకతని రేకెత్తిస్తున్నాయ్. ముఖ్యంగా ఆ చివరి వాక్యం... ఏంటది?

"జీవిత సత్యాన్ని తెలిపే 'ఆ' పదార్థంతో పులుసు వండుకొని చివరిసారి తృప్తిగా భోంచేసి వెళ్లిపోవాలి..."

జీవిత సత్యాన్ని తెలిపే పదార్థం అంటే...?

జీవిత సత్యాన్ని... తత్వాన్ని తెలిపే యోగులున్నారంటారు- గ్రంథాలున్నాయంటారు- వాక్యాలున్నాయంటారు-కానీ... పదార్థం ఉండడమేంటీ...?

ఉంటే గింటే అదేమిటై ఉంటుంది...?

వీడెవడో సామాన్యుడిలా లేడు... భలే ఆసక్తిని- అగ్గిపుల్ల లేకుండా వెలిగిస్తున్నాడు.

మళ్లీ ఆ వాక్యాల వరుసని పరిశీలించాను.

ఒకటి... రెండు... మూడు... నాలుగు... అ...యి...దు- జీవితసత్యాన్ని తెలిపే 'ఆ' పదార్థంతో పు...లు...సు-

చంపేశాడు నా కొడుకు-

భలే సస్పెన్స్‌లో పెట్టిపోయాడు. ఇక ఈ రాత్రికి నాకు నిద్రలేనట్టే..

మిస్టిసిజాన్ని, ట్రావెలింగ్‌నీ, ఫిలాసఫీని అత్యంత ఇష్టపడే నన్ను- ఈ వేసవి సెలవుల మొదటి ఆదివారపు మిట్టమధ్యాహ్నం- తన అయిదో వాక్యంతో ఇట్లా ఒక అనామకుడు అబ్బురపరుస్తాడని నేను కలలో కూడా ఊహించలేదు.

'అయినా... మిత్రమా! ఎవడో ముక్కూమొహం తెలియని వ్యక్తి న్యూస్‌పేపర్ మీద రాసుకున్న రాతల్ని అంత సీరియస్‌గా తీసుకోవల్సిన అవసరం ఉందం టావా...?' అనిపించిందో క్షణం.

'అయినా సరే... గురువా! రంగూ రుచీ వాసనా లేని రొటీన్ జీవితానికి అద్భుతమైన పజిల్ ఒకటి వాక్యం రూపంలో దొరికింది. అరుదైన విషయమిది. నువ్వు కోరుకుంటే వచ్చింది కాదు.. కానీ అది నడిచి వచ్చిన తీరే వేరు. మైదాపిండి పొట్లంలో... కిరాణా కొట్లోంచి... నీ చేతివేళ్ల చివర్ల నుండి నీ కళ్లల్లోకి జారి... ఓహ్... దీని రహస్యాన్ని ఛేదించు.... ఆ మిస్టరీని జుర్రుకో... పండగ చేసుకో... ఆ థ్రిల్లే వేరు...' అనీ అని పించింది లోపలి నుండి మరో క్షణం.

నేను ఈ రెండో క్షణానికే లొంగిపోయాను.

నిజమే-

ఎవడో అనామకుడు రాసుకున్న వాక్యం అయితే నేం...? అది నిజంగా రాసుకున్నదైతేనేం... అబద్ధ మైతేనేం...? ఎలాంటి వాక్యమిది?

జీవిత సత్యాన్ని తెలిపే పదార్థం...!

ఫెంటాస్టిక్... దీనంతేదో చూసి తీరాల్సిందే... పండగ చేసుకోవాల్సిందే..

నిజంగా ఉందో లేదో తెలీదు కానీ- ఒకవేళ ఉంటే-

ఆ పదార్థాన్ని కనిపెట్టి- ఈ ఆకుపచ్చ అక్షరాల వాడికి దాని పేరు చెబితే-

ఆ పేరుని వినగానే- నేను దాన్ని ఎలా కనిపెట్ట గలిగానో తెలియక- అతడు సంభ్రమాశ్చర్యాలకు గురవుతుంటే-

అతని ఆశ్చర్యపు చేతివేళ్లకు నా కరచాలనా న్నందించి-

అదుగో- అప్పుడు చెప్పాలి- ఈ పదార్థాన్ని నేనెలా కనిపెట్టానో... వావ్... ఊహించుకుంటేనే ఎంత మనో హరంగా ఉందా దృశ్యం...

అంతా బాగానే ఉంది కానీ- ఇంతకీ ఆ వ్యక్తి ఎవరని వెళ్లి కలుసుకుంటాను?

న్యూస్‌పేపర్ మీద అతని పేరూ ఊరూ లేవు కదా! పైగా అతడు రాసిందంతా నిజమే అయివుంటే అతను ఈపాటికే బహుశా ఆత్మహత్య కూడా చే..సు.. కొ..ని.....

గబగబా ఆ న్యూస్‌పేపర్ మీది తేదీని చూసాను.

రెన్నెళ్ల క్రితం పేపరది... "ష్..." మని నిట్టూర్చి- నీరసంగా కుర్చీలో వెనక్కి వాలాను.

వెళ్లిపోయాడో... ఇంకా ఈ భూమ్మీద సంచరిస్తూ ఉన్నాడో తెలియదుకానీ- అతడు నాకో కొత్త పండగని పరిచయం చేసిపోయాడు... ఆ పండగ పేరు- 'పదార్థా న్వేషణ' అనుకున్నాను మనసులో.

లేచి షర్ట్ తొడుక్కొని- పొద్దున మైదాపిండి కొని తెచ్చిన కిరాణాషాప్ వైపు బయలుదేరాను అతని వివరాలేమైనా దొరుకుతాయేమోనన్న ఆశతో-

బయట బాగా ఎండగా ఉంది. ఏప్రిల్ నెల సూర్యుడు బాగానే మండిపడుతున్నాడు లోకం మీద.

ఈ విషయాన్ని నేనింతగా పట్టించుకోడానికి మిస్టిసిజం పట్ల నాకున్న ఆసక్తే కాకుండా- ఆల్రెడీ మొద లయి- మరో రెండు నెలలు నా ముందు పరుచుకున్న వేసవి సెలవుల తీరిక ఒక కారణం కావచ్చు- లేదా దేన్ని పట్టుకుంటే దాన్లో పడి కొట్టుకుపోవడమనే నా మన స్తత్వం కూడా మరో కారణం కావచ్చునని విశ్లేషించు కుంటూ కిరాణా షాపులోకి అడుగుపెట్టాను.

షాపతనితో, "పొద్దున మీ షాప్‌లో నాకు మైదా పిండిని పొట్లంగా కట్టిన ఇంగ్లీష్ న్యూస్‌పేపర్స్ ఇంకే మైనా ఉన్నాయా? ఏంలేదు- ఒక ఆర్టికల్ పడింది, అందుకు," అన్నాను- 'ఎందుకు?' అని అతను వేస్తా డేమో అనుకున్న ప్రశ్నకు కూడా నేనే సమాధానం చెబుతూ.

షాపతను ఇవేమీ పట్టించుకోకుండా- నావైపు నవ్వుతూ చూసి, "పొద్దున మీకు మైదాపిండి కట్టాక షాప్ క్లోజ్‌చేసి ఫ్యామిలీతో మ్యారేజీ రిసెప్షన్‌కి వెళ్లొచ్చి ఇంతకుముందే మళ్లీ తెరిచాను. మీకు పొట్లం కట్టిన తర్వాత న్యూస్‌పేపర్‌ని మళ్లీ ఉపయోగించలేదు. అయినా లోపలికొచ్చి ఇక్కడున్న పేపర్లలో మీకేమైనా ఉపయోగపడతాయేమో చూసుకోండి," అని లోపలికి ఆహ్వానించాడు.

నేను గబగబా షాప్‌లోకి అడుగుపెట్టి- ఒక స్టూల్ లాక్కుని కూర్చొని- గుట్టగా పేర్చబడి ఉన్న పాత న్యూస్ పేపర్లన్నీ వెదికాను. నాకు కావల్సిన పేపర్ కాకుండా వేరే వేరేవి కనిపించాయి.

"ప్చ్..." అని నిట్టూర్చి- షాపతనికి థాంక్స్ చెప్పి బయటికొచ్చి ఇంటివైపు నడవసాగాను.

నీడలా- మళ్లీ ఆ వాక్యమే నన్ను వెంటాడ సాగింది.

'జీవిత సత్యాన్ని తెలిపే ఆ పదార్థంతో పులుసు వండుకొని చివరిసారి తృప్తిగా భోంచేసి వెళ్లిపోవాలి.'

పు...లు...సు...

'అవునూ... ఎన్ని రకాల పులుసులున్నాయో తెలుసుకుంటే ఏమైనా ఆధారం దొరుకుతుందేమో...? బెండకాయ పులుసు, వంకాయ పులుసు, టమాట పులుసు, ములక్కాయ పులుసు...' ఇట్లా నాలో నేనే గొణుక్కుంటూ ఇంట్లోకి అడుగుపెట్టి- కాళ్లు కడుక్కొని- పడక్కుర్చీలో వెనక్కివాలి- శ్రీమతిని పిలిచి-

"నీకు తెలిసిన కొన్ని కూర పులుసుల పేర్లు చెప్పు లక్ష్మీ," అన్నాను.

తనుకూడా టమాటా, బెండకాయ అని మొదలు పెట్టి ఏవేవో లిస్ట్ చదివి, "ఈ పూటకి పులుసు వండడం కుదరదు. ఆల్రెడీ ఎగ్‌ఫ్రై, చారూ చేసేశాను," అని లోపలికి వెళ్లిపోయింది.

నేను చిన్నగా నాలోనే నవ్వుకొని-

నాకు తెలిసినవీ, శ్రీమతి చెప్పినవీ ఓ పది పదిహేను పులుసుల పేర్లు ఒక కాగితం మీద రాసి-

ఒక్కొక్క పదార్థాన్ని పరిశీలనగా చూస్తూ-

జీవిత సత్యాన్ని తెలిపే లక్షణాలేమైనా వాటిలో దొరుకుతాయేమోనని ప్రయత్నించాను. సొరకాయ... బీరకాయ... పొట్లకాయ... ఊహూ! ఒక్క కూరలోనూ జీవితసత్యాన్ని తెలిపే లక్షణాలు కొంచెమైనా గోచరించ లేదు.

ఇదంత అర్జంటుగా తేలే విషయం కాదనిపిం చింది. అయినా అంత తేలిగ్గా అవగతమైతే అది జీవిత సత్యం కాదేమోనని మళ్లీ ఒక మానవ అనుమానం. ఇక ఈ విషయం గురించి ఎక్కువ ఆలోచించి బుర్ర పాడు చేసుకోవడం కన్నా ఎల్లుండి నుండి ప్రారంభం కాబోయే ఈ వేసవి సెలవుల ప్రత్యేక యాత్ర మీద పూర్తిగా దృష్టి పెట్టడం బెటరని నిశ్చయించుకున్నాను.

ప్రతి వేసవి సెలవుల్లోనూ ఏదో ఒక కొత్త ప్రదే శానికి వెళ్లి గడిపి రావడాన్ని ప్లాన్ చేసుకునే నేను ఈసారి ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ సమీపంలోని అడవుల్లో వుండే శూన్యాన్ని ఆరాధించే యోగుల బృందాన్ని కలిసి రావడానికి ప్లాన్ గీసుకున్నాను, డిస్కవరీ ఛానెల్లో పోయి నేడాది వచ్చిన 'శూన్యారాధన యోగులు' అనే ప్రోగ్రాం చూసి-

దేవుడూ దేవతల్నీ, క్షుద్రదేవతల్నే కాకుండా శూన్యాన్ని ఆరాధించేవాళ్లు కూడా ఈ భూమ్మీద వున్నారా?- అని ఆసక్తి కలిగి- ఆ ప్రదేశానికి ఎలా వెళ్లాలో తెలియజేసిన వివరాలన్నీ నోట్ చేసుకొని- ఇప్పుడు ఈ సమ్మర్ టూర్‌ని వాళ్లని కలిసి రావడానికై ప్లాన్ చేసుకున్నాను.

ఎల్లుండి ఉదయం హైదరాబాద్ బయలుదేరి ఎప్పట్నుండో రమ్మని ఆహ్వానిస్తోన్న చిన్ననాటి మిత్రుడు సూనా (సూర్యనారాయణ) వద్ద ఓ నాలుగురోజులు గడిపి- ఆ తర్వాత శూన్యాన్ని వెదుక్కుంటూ... కాదు కాదు- శూన్యాన్ని ఆరాధించే యోగుల్ని వెదుక్కుంటూ భువనేశ్వర్ అడవులవైపు బయలుదేరాలి. మొత్తం నెలరోజుల టూర్... ఏమో! ఈ ప్రయాణంలో 'ఆ' పదార్థం కూడా దొరికితే ఈ సమ్మర్ టూర్‌కి అది బోనస్ అవుతుంది. పుణ్యమూ- పురుషార్థంలాగా- శూన్యమూ- పదార్థమూ అన్నమాట... అట్లా ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆరోజులోంచి కూడా దొర్లిపోయాను. ఆ రాత్రి మాత్రం ఒక విచిత్రమైన కలొచ్చింది.

దట్టమైన కీకారణ్యంలో- చుట్టూ పెద్దపెద్ద లోయలున్న ఓ కొండమీది మైదానపు ప్రాంతంలో- ఒక పెద్ద రాళ్ల పొయ్యి చుట్టూ కొందరు యోగులు నగ్నంగా కూర్చొని ఉన్నారు. ఆ పొయ్యిమీద మరింత పెద్ద గిన్నెలో ఏదో పులుసు మరుగుతోంది. పండు ముదు సలి యోగి ఒకడు తన పొడవాటి చెయ్యిని ఆ గిన్నెలో పెట్టి అక్కడ కూర్చున్నవారందరి ఖాళీ పాత్రల్లో ఆ పులుసు పోస్తున్నాడు.

హఠాత్తుగా వాళ్లందరి వెనుక ప్రత్యక్షమైన నేను ఆ దృశ్యం చూసి-

నేను శతాబ్దాలుగా వెదుకుతున్నదేదో ఆ గిన్నెలో మరుగుతోందని భావించి- ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా- వాళ్లందరి మీద నుండి గెంతుతూ... వేగం గా పరుగెత్తుకుంటూ వెళ్లి... ఆ పొయ్యిని సమీపించి...

సలసలా పులుసు మరుగుతోన్న ఆ గిన్నెలోకి తొంగి చూశాను...

అంతే...

అలారం మోతతో కల చెదిరింది. 'ఛీ... వెధవ అలారం... ఇదిప్పుడే మోగి చావాలా... ఒక్క రెండో

మూడో క్షణాలో ఆగితే- ఆ గిన్నెలో మరుగుతున్న పదార్థమేదో తెలిసిపోయేది. అది ఖచ్చితంగా నేను నిన్నంతా బుర్ర బద్దలు కొట్టుకొని ఆలోచించి, లాభం లేదని వదిలేసిన 'ఆ' పదార్థమే అయి ఉంటుంది. లేకుంటే ఇలాంటి కల ఎందుకొస్తుంది? ప్చ్... జస్ట్ మిస్...' అని అలారాన్ని తిట్టుకున్నాను.

నిద్ర లేచి కాలకృత్యాలవీ ముగించుకొని టీ తాగుతూ టీవీలో మార్నింగ్ న్యూస్ చూస్తోన్న నాకు ఉదయాన్నే మరో ఆశ్చర్యం గొలిపే సమాచారం ఎదురైంది.

"ఎల్లుండి నుండి హైదరాబాద్ జింఖానాగ్రౌండ్స్ లో- నెలరోజులపాటు నేషనల్ ఫుడ్ ఫెస్టివలట!"

దాదాపు పదివేల స్టాళ్లు... లక్షల రకాల వంట కాలు...

'జింఖానా గ్రౌండ్స్- ఖానా గ్రౌండ్స్ కాబోతుం దన్నమాట' అనుకొని నవ్వు కున్నాను.

ఒక్క మటన్ బిర్యానీయే వెయ్యిరకాలట... చికెన్ బిర్యానీ ఎనిమిదొందల రకాలు... తందూరి చికెన్ అయిదొందల రకాలు... చాపలపులుసు మూడొందల...

చా...ప...ల...పు...లు...సు....

నా బుర్రలో ఏదో ఫ్లాష్ వెలిగింది... సంతోషం పట్టలేక 'య్యా...!' అని కేక పెట్టాను. పు...లు...సు...-

'జీవిత సత్యాన్ని తెలిపే ఆ పదార్థంతో పులుసు వండుకొని,' అని చదివిన నిన్నటి వాక్యం గుర్తుకొచ్చింది.

ఒక్క నిమిషం ఆలోచనల్లోపడ్డాను.

ఇది కో-ఇన్సిడెంటా...? లేక... నిన్నంతా ఆ వాక్యవుధ్యాసలో తీవ్రంగా ఉండడంవల్ల- దేన్ని చూసినా- అది నా జిజ్ఞాసను సపోర్ట్ చేస్తోన్న అంశమను కుంటోన్న... నా భ్రమా...? మరేదైనానా...?

లేకపోతే- నిన్న మధ్యాహ్నం పాత ఇంగ్లీష్ న్యూస్ పేపర్లో ఆ వాక్యాన్ని చదవడమేంటీ...? వెంటనే నా మెదడు అన్వేషణకు పురిగొల్పడమేంటీ? మర్నాడే రకరకాల పదార్థాల ప్రదర్శన యొక్క సమాచారం ఇట్లా టీవీ న్యూస్ ద్వారా తెలియడమేంటీ...? అందులోనూ- నేను బయలుదేరబోతోన్న హైదరాబాద్‌లోనే ఆ నేషనల్ ఫెస్టివల్ జరగబోవడమేంటీ...? నేను శకునాల్నీ- అదృష్టాన్నీ నమ్మను.

అయినాసరే- ఇదంత తేలిగ్గా తీసిపడేయాల్సిన విషయం మాత్రం కాదనిపించింది. ఎలాగూ హైదరా బాద్ వెళ్తున్నా కాబట్టి అక్కడున్న నాలుగైదు రోజుల్లో సరదాగా ఆ ఫుడ్ ఫెస్టివల్ కెళ్లి వెదికితే-

కొన్ని వేలరకాల వంటకాల ప్రదర్శన కాబట్టి- తప్పకుండా 'ఆ' పదార్థం కూడా దొరకొచ్చు. పెద్ద శ్రమ పడకుండానే ఈ టూర్లో ఆ పనీ అయిపోతుంది అను కున్నాను.

శరీరంలోకి ఏదో తెలియని హుషారు ప్రవేశించి నట్లయింది.

ఇక ఆ రోజంతా ఈలపాటలు పాడుకుంటూ- నెలరోజుల ప్రయాణానికి సంబంధించిన లగేజంతా సర్దుకున్నాను. లగేజంటే పెద్ద లగేజేం కాదు- రెండు జీన్స్- నాలుగు టీషర్టులు- ఒక టవల్- ఒక బ్లాంకెట్- కొన్ని పుస్తకాలు- వాక్‌మెన్- క్యాసెట్లు- బైనాక్యులర్- టార్చిలైట్... అంతే-

సాయంత్రం శ్రీమతిని వాళ్ల అమ్మవాళ్ల ఊరికెళ్లే బస్ ఎక్కించొచ్చి భోంచేసి తొమ్మిదింటికల్లా నిద్రలోకి జారుకున్నాను- ఎర్లీగా నిద్రలేవాలి కాబట్టి.

*

'భద్రాచలం రోడ్' అనే పేరుతో కనిపించే కొత్త గూడెం రైల్వేస్టేషన్‌కి కూతవేటు దూరంలో ఉన్న- నాకత్యంత ఇష్టమైన- నాకు సంబంధించి ఈ భూమ్మీది గొప్ప ప్రదేశాల్లో ఒకటైన ఇరానీ హోటల్ కాస్మోలోకి తెల్లవారుఝాము ఐదుగంటలకు అడుగుపెట్టాను భుజానికి వేలాడుతున్న జర్నీ బ్యాగుతో.

డికాషన్ మరుగుతోన్న చిరపరిచిత వాసనతో- స్వాగతం పలికింది ట్యూబ్‌లైట్ల వెలుతురుతో కాస్మో.

కొన్ని ప్రదేశాలకు పొడవు, వెడల్పు, లోతు, కాలమే కాకుండా మానవ ఆత్మతో ముడిపడ్డ అను బంధమేదో ఉంటుందనిపిస్తుంది ఈ హోటల్ పట్ల నాకున్న ఇష్టాన్ని గుర్తు చేసుకుంటే.

యవ్వనారంభంలో మిత్రులతో సరదాగా గడిపిన సాయంత్రాల నుండి... అలాంటి సాయంత్రాలు రాత్రులలోకి పొడిగించబడి... రాత్రులు ఉదయాల్లోకి అనువదించబడి... ఉదయాలు మధ్యాహ్నాల మీదుగా సాయంత్రాలను చేరుకొని... టీకప్పులు కప్పులుగా... సిప్పులు సిప్పులుగా- ఎందరు మిత్రులతోనో... ఎన్ని కబుర్లతోనో... ఎన్నో రుతువుల్లో కరిగి- వ్యామోహ పరిచి...

రైల్వేస్టేషన్లోంచి అనౌన్స్‌మెంటేదో వినబడుతోంది. సికింద్రాబాద్ నుండి వచ్చే మణుగూరు ట్రైన్ అనౌన్స్ మెంటనుకుంటా. లేకపోతే సింగరేణి ఫాస్ట్ పాసింజర్ దయినా అయి ఉండొచ్చు.

అది బయలుదేరడానికి ఇంకా అరగంటకు పైగా టైం ఉంది. ఆ రైల్లో బయలుదేరి డోర్నకల్ జంక్షన్లో

దిగి శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లోకి మారితే మధ్యాహ్నం కల్లా హైదరాబాద్‌లో మిత్రుడు సూనా సమక్షంలో వుండొచ్చు.

ఉదయాన్నే పాసింజర్ రైలు ప్రయాణం చాలా బాగుంటుంది. అందులోనూ డోర్నకల్ వరకు. రాత్రంతా చీకట్లో తడిసిన చిన్నచిన్న రైల్వేస్టేషన్లు... వాటికవతల చాలాదూరంలో చిన్నచిన్న తండాలు... మలుపులో అదృశ్యమయ్యే మట్టి రహదార్లు... పొడవుగా సాగే కొండలు... బాల్యస్మృతులను, తట్టిలేపే రైలు డబ్బాల ఇనుప వాసన...

నిజానికి నిన్న రాత్రి పన్నెండు గంటలవరక్కూడా హైదరాబాద్ వెళ్లడానికి బస్ సౌకర్యాలున్నాయి. అయితే తెల్లవారుఝామున ఏ నాలుగింటికో నిద్రలేచి- హోటల్లో నా లాలాజలపు అంచుల్ని ఆశించి పొయ్యి మీద మరిగే ఒక కప్పుటీని ఊహించు కుంటూ.... అంత పొద్దున్నే కాస్మోలోకి వచ్చి పింగాణీ కప్పు ముందు కూర్చొని- బ్యాగ్ పక్కన పెట్టి చీచా కోసం చూశాను.

లోకమింకా పూర్తిగా నిద్రలేవని లేలేత తెల్లవారు సమయాన- ఆ కప్పులోంచి విశ్వంలోకి లేచే పొగలో- జీవనోత్సవానికి సంబంధించిన మధురభావన ఏదో మనసును ఆక్రమిస్తోంటే- అప్పుడు తేయాకు ఆత్మ కలిసిన ద్రవరూపాన్ని స్వీకరించడం మరో మోజు... తీరిగ్గా వరంగల్‌కో, హైదరాబాద్‌కో వెళ్లాల్సి వచ్చినపుడు ఈ ప్రయాణాన్నే ఎంచుకుంటాను. ఇప్పుడు కూడా అలాగే బయలుదేరి కాస్మోలోకి అడుగుపెట్టి చెట్టు హృదయాన్ని ఇంకా తమలో దాచుకున్నట్లున్న పాత కాలం నాటి చెక్క టేబుల్ మీద కూర్చొని- బ్యాగ్ పక్కనపెట్టి- చీచా కోసం చూశాను.

చీచా- ఈ హోటల్ సీనియర్ సర్వర్. అసలు పేరు రామారావు. హిందీ మాట్లాడితే ముస్లిం అను కుంటారతన్ని. యాభై అయిదేళ్లు దాటుతోన్నా ఎప్పుడూ హుషారుగా ఉంటాడు. భలే ఆసక్తికరమైన వ్యక్తి. నాలాంటి రెగ్యులర్ కస్టమర్స్‌తో బాగా చనువుగా వుంటాడు.

నేనతన్ని హోటల్ సర్వర్‌గా కన్నా ఒక తాత్వికుడి గానే గుర్తుపెట్టుకుంటాను.

తాత్వికుడు అని అంత పెద్దమాట ఎందుకంటు న్నానంటే-

మనుషులందరూ (నాతో కూడా కలిపి) గట్టిగా పట్టుకునే చాలా విషయాల్లో చీచా చాలా తేలిగ్గా- వదులుగా ఉంటాడు.

జేబులో డబ్బులున్నా పరవాలేదు- లేకపోయినా ఫరవాలేదు. తిండి దొరికినా ఒకటే- దొరక్కపోయినా ఒకటే.

రేపుదయం నిద్రలేచేసరికి బొందిలో ప్రాణ మున్నా ఫరవాలేదు- లేకపోయినా ఫరవాలేదు.

పెద్దగా కోరికలేం ఉన్నట్లు కనిపించడు. అట్లాగని నిరాసక్తిగా ఏం ఉండడు. తన సర్వర్ పనిని ఎంత ఇష్ట పడతాడంటే-

''పొగలు కక్కే టీని, బిర్యానీల్ని పొయ్యి దగ్గ ర్నుండి వేడివేడిగా... మీ నాలుకల దగ్గరికి తీసుకురావ డానికి మధ్యలో ఉండేదంతా నాకో దసరా పండగలా ఉంటుంది. రిక్షా తొక్కుకునే వాడి దగ్గర్నుంచి పెద్దపెద్ద ఆఫీసర్ల దాకా ఆకలితో వచ్చి ఆబగా తింటున్నపుడు రకరకాలుగా మెలికలు తిరిగే వాళ్ల మూతుల్ని చూసి నపుడు నాకైతే మనుషులంతా ఒక్కటే అనిపిస్తుంది. ఎందుకో అన్ని రకాల మనుషుల మీద ఒక్కసారిగా ప్రేమ కలుగుతుంది. అయితే కడుపులో ఎలుకలు పరుగెత్తుతున్నా ఎదురుగా బిర్యానీ ఉన్నపుడు దాని మీద పడి కుమ్మెయ్యకుండా- తినడంలో కూడా స్టేటస్ మెయింటెన్ చెయ్యాలని- కొంతమంది నెమ్మదిగా- స్టైల్‌గా తింటారు చూడూ... వాళ్ల అవస్థని చూస్తే మాత్రం నాకు నవ్వొస్తుంది,'' అని పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతాడు.

పదోతరగతి సగంలో చదువు మానేసానని చెబు తాడు కానీ లోకాన్ని చదివినవాడిలా ఉంటాయి చీచా మాటలు.

''ఆ కాలంలో పదోతరగతి వరకూ చదివి ఈ సర్వర్ ఉద్యోగం ఏంటి చీచా?'' అనడిగితే-

''మొదట్నుంచీ ఇదే ఉద్యోగం కాదు చిన్నా. అప్పట్లో రామవరం బస్టాండు దగ్గర ఒక హోటల్ నడిపాను చాలాకాలం. లాసొచ్చింది. మనకింకేం పని చాతకాదు. ఈ హోటల్లో కొచ్చిపడ్డా. అంతే,'' అని మళ్లీ నవ్వుతాడు.

ముస్లిం యజమాని నిర్వహించే ఇరానీ హోటల్లో పనిచేస్తున్న హిందువయినా- ఎవరిద్వారా తెలుసు కున్నాడో కానీ గాలిబ్ రుబాయిల గురించీ, సూఫీ కవిత్వం గురించి అప్పుడప్పుడూ ప్రస్తావిస్తుంటాడు. అతడు వేసుకునే డ్రెస్‌కీ, అతడు మాట్లాడే మాటలకీ, అతడి తొర్రిపన్ను నవ్వుకీ, వెనుక నుండి చూసినపుడు అతడు నడిచే నడకకీ, డ్యూటీ దిగాక సాయంత్ర మెప్పుడో రాయల్ పాన్‌షాప్ దగ్గర పాన్ నములు తున్నపుడు కనిపించే అతడి దర్జాకీ-

ఒకదానితో మరొకటి ఏం సంబంధం లేనట్లుగా ఉంటాయి. అతడు నాకు బోర్ కొట్టకుండా- బాగా నచ్చడానికి ఇలాంటి వైరుధ్యాలన్నీ కూడా ఒక కారణం కావొచ్చుననిపిస్తుంటుంది.

'దీనమ్మ... జీవితం... విషాదం... అద్భుతం...' లాంటి పదాలు కూడా వాడుతూ అతడెప్పుడైనా మాట్లాడితే- అప్పుడతని ఎర్రజీరల కళ్లల్లోకి చూడడం నాకు బాగా ఇష్టం.

చేస్తున్న ఉద్యోగానికీ, మాట్లాడే మాటలకీ ఏ మాత్రం సంబంధం లేకుండా జీవించే చీచాని కలవడమంటే ఒక ఫ్రెష్ ఎనర్జీని లోపలికి తీసుకోవడమే అనిపిస్తుంది.

అలాంటి చీచా కోసం వెదికాయి నా కళ్లు. అతడు కనిపించలేదు. ఎక్కువగా నైట్‌షిఫ్ట్‌లే చేస్తాడు కాబట్టి తప్పకుండా కనిపిస్తాడనుకున్నాను.

అయితే మూడునెలలు వీలైనన్ని ఎక్కువ షిఫ్ట్‌లు చేయడం, పదీ పదిహేను రోజులు కనిపించకుండా పోవడం చీచాకు మామూలే.

మళ్లీ కనిపించి టీ కప్పుని నా ముందు పెట్టినపుడు, "ఏమైపోయావ్ ఇన్ని రోజులు" అనడిగితే-

"మా ఊరెల్లాను. నా మనవరాలు స్వప్ననీ, దోస్తుల్నీ కలిసి రావడానికి. తెలుసుగా... అక్కడికెళ్తే మళ్లీ వెనక్కి రాబుద్ధికాదు. కానీ డబ్బులన్నీ అయిపోయాకనో లేదా పెద్ద సేఠ్ కబురు పెట్టాడనో మళ్లీ ఈ హోటల్‌కి రావాలనిపిస్తుంది. వచ్చేస్తాను. మన ఉద్యోగానికేం ఢోకా ఉండదనుకో. సేఠ్ చాలా మంచోడు. నేనంటే బాగా ఇష్టపడతాడు," అని నవ్వుతాడు.

అతని ముఖంలో ఎప్పుడూ చెక్కుచెదరని చిరునవ్వుని చూసిన చాలాసార్లు నాకెందుకో అతడి జీవితంలో జరిగిన అతి పెద్ద విషాద సంఘటనే గుర్తుకొస్తుంటుంది.

దాదాపు ఏడేళ్ల క్రితం అనుకుంటా- చింతూరు నుండి నర్సీపట్నం వెళ్లే దార్లో ఉన్న దారాలమ్మకొండ జాతరకి వెళ్లొస్తూ ఆ ఘాటీ రోడ్డు మీద నుండి లోయలోకి లారీ బోల్తాపడ్డ దుర్ఘటనలో తన భార్యా, కొడుకూ, కోడలితోపాటు దగ్గరి బంధువులు ముగ్గుర్ని కోల్పోయాడు చీచా. కొడుకు ఏకైక సంతానమైన మనవరాలు స్వప్నతో మాత్రం చీచా ఆ ప్రమాదం నుండి బతికి బయటపడ్డాడు.

ఆ సంఘటన తర్వాత భద్రాచలం అవతల చింతూరుకి దగ్గర్లోని తన గ్రామం చినశీతనపల్లిలో ఒక దగ్గరి బంధువు వద్ద తన మనవరాలినుంచి ఆమెని చదివిస్తూ... ఇక్కడ ఈ ఇరానీ హోటల్లో పనిచేస్తూ- అప్పుడప్పుడూ తన ఊరికి వెళ్లొస్తుంటాడు. ఇవన్నీ పక్కన పెడితే-

నాకు బాగా విస్మయాన్ని కలిగించే విషయం ఇంకొకటుంది.

దాదాపు తన కుటుంబసభ్యులందరినీ కోల్పోయిన ఆ దుర్ఘటన గురించి ఎవరికైనా చెప్పాల్సివస్తే- చీచా ఆ విషాదాన్ని విచారవదనంతో కాకుండా- పగలబడి నవ్వుతూ... ఆ సంఘటనని ఒక జోక్‌లా చెబుతాడు. ఇలా-

"ఆ జాతర రోజు భాయ్ సాబ్... ఆ లారీ డ్రైవర్ జగదల్‌పూర్లో పట్టించాడో... కుంట దగ్గర్లో... ఎక్కడో బాగా నాటుసారా పట్టించినట్లున్నాడు నాయాల... నేనూ, నా మనవరాలూ డ్రైవర్ క్యాబిన్లో కూర్చున్నాం. మావాళ్లు, మా ఊరోళ్లు కొందరు లారీ పైనెక్కారు. ఆ రాత్రి నాకు బాగా గుర్తు... ఆ డ్రైవర్‌గాడు లారీని వాడిష్టం వచ్చినట్లు నడపసాగాడు. 'మెల్లిగా పోనియ్' అని నేను చెబుతోన్న మాటల్ని వాడు వినిపించుకునే స్థితిలో లేడు. నా కొడుకు- ఒకటే బూతు జోకులనుకో... ఆడేసే జోకులకి క్లీనర్‌గాడు పొట్ట పట్టుకొని క్యాబిన్లోనే పొర్లిపొర్లి దొర్లుతున్నాడు. మధ్యమధ్యలో సినిమా పాటలు పాడసాగాడు. ఏం సినిమా అది... ఆ..! అడివి రాముడు... ఆ సినిమాలో పాట... 'ఆరేసుకోబోయి...' పాటను వాడి లారీ ఫీల్డు భాషలో బూతులు జోడించి పాడుతూ... యమస్పీడుగా లారీని ఎదురుగా వెళ్తోన్న ఆర్టీసి బస్సును ఓవర్‌టేక్ చేయబోయి... మలుపు దగ్గర లోయలోకి దొర్లించేసాడు నా కొడుకు...

"ఆ లారీ డిడుంగు... డిడుంగుమని (చేతుల్తో అభినయిస్తూ) లోయలోకి నాలుగైదు పల్టీలు కొట్టడం మాత్రమే నాకు గుర్తుంది. నా ఒళ్లో నిద్రపోతోన్న నా మనవరాలిని గట్టిగా పట్టుకున్నట్లు గుర్తు. తెలివొచ్చేసరికి భద్రాచలం గవర్నమెంటాసుపత్రిలో- క్యాబిన్లో కూర్చున్న ఆ క్లీనర్‌గాడు, చిన్నాచితకా దెబ్బల్తో నా మనవరాలు, చెయ్యి విరిగి నేను మాత్రమే బతికి బయటపడ్డట్లు తెలిసింది. ఆ బూతు జోకుల డ్రైవరూ, లారీ పైకెక్కిన మా వాళ్లందరి ప్రాణాలు పైన్నే పోయాయి," అని చెబుతూ-

ఆరోజు లారీడ్రైవర్ క్యాబిన్లో పాడిన అడవి రాముడు సినిమా పాటను కొద్దిగా మార్చి- "ఆరేసుకోబోయి లారేసుకున్నాడు... హరీ... హరీ... ప్రాణాలు

హరీ..హరీ..'' అని పాడుతూ- పెద్ద పెట్టున పగలబడి నవ్వుతూ- టీ తీసుకురావడానికి కిచెన్‌లోకి వెళ్లిపోతాడు.

దాదాపు కుటుంబసభ్యులందరినీ కోల్పోయిన ఆ సంఘటన గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు- విచారం తో కాకుండా- దాన్నో జోక్‌లా చెబుతున్నాడంటే చీచా తనవాళ్ల పట్ల ప్రేమానురాగాలు లేని వ్యక్తి అయి వుంటాడా...? లేక యాక్సిడెంట్ వల్ల కొంచెం మతి స్థిమితం కానీ కోల్పోయి ఉంటాడా...? లేక కొందరు వ్యక్తుల జీవితాల్లో ఒకప్పటి సీరియస్ విషయమే కాలక్రమేణా జోక్‌గా పరిణామం చెందుతుందా...? లాంటి అనుమానాలెన్నో మొదట్లో కలిగాయి నాకు.

కానీ అతడు తన భార్యాపిల్లల్ని ప్రాణప్రదంగా చూసుకునేవాడనీ, వాళ్లందర్నీ కళ్ల ముందే ఒకేసారి కోల్పోయిన వైరాగ్యంలోంచి అలా తాత్వికంగా మాట్లాడే అలవాటు ఏర్పడిందనీ- ఈ హోటల్లోనే చీచాని కలవ డానికి వాళ్ల ఊరినుండి వచ్చిన అతడి స్నేహితులు చెప్పినపుడు అసలు విషయం అర్థమైంది నాకు.

అత్యంత ఆప్తులైన కుటుంబసభ్యుల మరణాన్నే జోక్‌లా తీసుకొని చెప్పగలుగుతున్నాడంటే-

మిగతా జీవితాన్ని ఇంకెంత తేలిగ్గా తీసుకుంటు న్నాడో- అనిపించి అతడి పట్ల గౌరవం పెరిగింది. అప్ప ట్నుండీ అతన్ని సర్వర్‌గా కాకుండా ఒక తాత్వికుడిలానే గుర్తుంచుకుంటాను.

అలాంటి చీచా కోసం వెదికాయి నా కళ్లు ఆ తెల్లవారుఝాము హోటల్లో.

'ఈ ప్రయాణాన్ని చీచా చేతితో ఇచ్చే టీతో ప్రారం భిస్తే బాగుంటుంది,' అనుకుంటుండగా-

ఆశించినట్లుగానే చీచా కిచెన్‌లోంచి ఎవరికో టీలు తెస్తూ కనిపించాడు. 'హాయ్ చీచా' అని పలకరిం చాను అతనంత దూరంలో ఉండగానే. నావైపు చూశాడు- కానీ ఇంతకుముందు నన్ను చూసినపుడు పలకరింపుగా నవ్వినట్లు నవ్వలేదు. సీరియస్‌గా వున్నాడు.

తను తెచ్చిన టీలను అవతలి టేబుల్ వాళ్లకు సర్వ్ చేసి నా టేబుల్ దగ్గరి కొచ్చాడు.

ముఖం విచారంగా ఉంది. నీరసంగా కూడా అనిపించాడు. ఎన్ని రాత్రులు, పగళ్లు... నిద్ర... విశ్రాంతి లేకుండా డ్యూటీలు చేసినా ఇలా అతన్ని గతంలో ఎప్పుడూ చూళ్లేదు.

"ఏంటీ డల్‌గా ఉన్నావ్...?'' అని పలకరించాను.

"ఏంలేదు... చాయ్ చెప్పనా...? డికాషనా..?'' అనడిగాడు.

తెల్లవారుఝామున ఎప్పుడైనా ఇలా హోటల్ కొస్తే నిమ్మరసం పిండుకొని డికాషన్ తాగుతుంటాను- ముఖ్యంగా శీతాకాలంలో. ఆ అలవాటువల్ల అలా అడిగాడు.

"నీ ఇష్టం... నువ్వేదిస్తే అదే అమృతంలా స్వీకరి స్తాను గాలిబ్...'' అన్నాను నవ్వుతూ- అతన్ని మామూలు మూడ్‌లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తూ. కానీ అతను అలా సీరియస్ ముఖంతోనే కిచెన్‌లోకి వెళ్లి డికాషన్ తీసుకొచ్చి నాముందు పెట్టి- అలసిపోయి నట్లుగా నా ఎదురుగా కుర్చీ అంచున కూర్చున్నాడు.

మళ్లీ నేనే మాట కలిపాను. "ఏంటీ... ఏమైనా ప్రాబ్లెమా? ఈమధ్య మీ ఊరెళ్లొచ్చావా చీచా?'' అని.

నీరసంగా ఉన్న తలను కొంచెం పైకెత్తి- "నిన్నే వచ్చాను. నా మనవరాలు- తెలుసుగా- స్వప్న... దాని ఆరోగ్యం బాగాలేదు...'' అని ఆగి-

"గుండెజబ్బొచ్చింది... గుండెకి రంధ్రం పడిం దట. ఆపరేషన్ చేయించుకుంటేనే బతుకుతుందని చెప్పారు భద్రాచలంలో డాక్టర్లు. సేఠ్‌ని కొన్ని డబ్బులడిగి పోదామని వచ్చా నిన్న. సేఠ్ హైదరాబాద్ పోయాడట. ఇవ్వాళ వస్తాడంట. ఆయన కోసమే చూస్తున్నాను,'' అన్నాడు చీచా. లోకంలో విచారమంతా అతని గొంతులో ప్రతిధ్వనిస్తున్నట్లుగా ఉన్నాయా మాటలు.

తన కళ్ల ముందే అంతమంది కుటుంబసభ్యులు చనిపోయిన సంఘటనని ఒక జోక్‌లా చెప్పే చీచా- తన మనవరాలి అనారోగ్యం గురించి చెప్పాల్సి వచ్చినపుడు ఇంత విచారంతో ఉంటాడని నేనూహించలేక పోయాను.

బహుశా తల్లీతండ్రీలేని తన మనవరాలితో- తన ఒంటరితనానికి ఏర్పడ్డ అనుబంధం వల్ల ఇప్పుడా పాపకు సంభవించిన దుస్థితికి తట్టుకోలేక ఇతనింత సెంటిమెంటల్‌గా ఫీలవుతున్నాడేమో అనుకున్నాను.

"ఆపరేషన్ ఎక్కడ చేయిద్దామనుకుంటున్నావ్?'' అనడిగాను.

"ఎక్కడైనా చేయించే స్తోమత నాకెక్కడుంది చోటా. పుట్టపర్తిలో ఉచితంగా గుండె ఆపరేషన్లు కూడా చేస్తారటగా. ఎల్లుండి పాపను తీసుకొని అక్కడికి బయలుదేరుతున్నాం...'' అన్నాడు.

ఎక్కువ మాట్లాడిస్తే బోరుమని ఏడ్చేవాడిలా అని పించాడు. అతన్నెలా ఓదార్చాలో అర్థంకాలేదు.

పర్స్‌లోంచి కొన్ని నోట్లు తీసి అతడి రెండు చేతుల్ని దగ్గరగా కలిపి పెడుతూ- "ఖర్చులకు కొంచె మైనా ఉపయోగపడతాయి ఉంచు,'' అని-

"చీచా... మొదటిసారి నీ ముఖంలో విచారాన్ని చూస్తున్నాను. నీ మనవరాలికి ఏమీకాదు. ఈరోజుల్లో హార్ట్‌సర్జరీలంటే కాలికి ముల్లు తీసినంత తేలిగ్గా జరిగి పోతున్నాయ్. ఏం దిగులుపడకు. మరి నాకు ట్రైన్ టైం అయింది- వస్తాను," అని బిల్ పే చేసి అక్కడ్నుంచి కదిలాను.

హోటల్ మెట్లు దిగబోతూ ఎందుకో వెనక్కి తిరిగి చూడాలనిపించింది. కానీ చూసే ధైర్యం చేయలేక పోయాను.

*

"అదిరా సూనా సంగతి... శూన్యాన్ని ఆరాధించే యోగుల బృందాన్ని కలుసుకోవాలి. వీలైతే జీవిత సత్యాన్ని తెలిపే ఆ పదార్థాన్ని తెలుసుకోవాలి. ఇవీ... ఈ వేసవి సెలవుల యాత్రా లక్ష్యములు..." అన్నాను హైదరాబాద్ గాలి పీలుస్తూ- మిత్రుడు సూర్య నారాయణ కలిపిచ్చిన కాఫీ విషాన్ని తాగుతూ.

సూనా సన్నగా నవ్వాడు.

"బాగుంది. గొప్ప లక్ష్యములనే ఎంచుకుంటివి. శూన్యాన్ని ఆరాధించేవాళ్లను వెదుక్కుంటూ మెల్లిగా బయలుదేరొచ్చుగానీ నాలుగే రోజులుంటానంటున్నావు కాబట్టి ముందు 'ఆ' పదార్థాన్ని వెదకడానికి బయలు దేరుదాం పద. ఇక్కడ్నుంచి జింఖానా గ్రౌండ్స్‌కి వెళ్లిరావ డానికే సగంరోజు పడుతుంది," అని తొందరపెట్టాడు వాడు. ఇద్దరం రెండు సిటీబస్సులు మారి చీకటిపడే వేళకి జింఖానా గ్రౌండ్స్ చేరుకున్నాం.

ప్రారంభదినం కావడంవల్ల నేషనల్ ఫుడ్ ఫెస్టివల్‌కి 'పొట్ట చేతబట్టుకొని' కారుల్లోంచి దిగిన భోజనప్రియులు చాలామంది బారులు తీరారు.

ఎంట్రెన్స్ నుండి లోపలికి వెళ్లడానికే మాకు గంటన్నర పట్టిందంటే రద్దీని మీరు అర్థం చేసుకోవచ్చు.

ఇక లోపలికి వెళ్లాక అక్కడ కనిపించిన దృశ్యాలు చూసి మా 'నోళ్లను' మేమే నమ్మలేకపోయాం. ఈ భూమ్మీద ఎన్నిరకాల పదార్థాలు దొరుకుతాయో- అన్నిరకాల పదార్థాలతోనూ వంటకాలు సిద్ధం చేయబడి ఉన్నాయ్. ఆఖరికి పచ్చగడ్డితో కూడా ముప్పైరకాల వంటకాలు తయారుచేసిపెట్టారు స్టాల్లో... పచ్చగడ్డి కూర... పచ్చగడ్డి వేపుడు... పచ్చగడ్డి చారు... పచ్చగడ్డి పులుసు... పచ్చగడ్డి పచ్చడి... పచ్చ...

ఈ స్టాల్ దగ్గర కూడా పెద్దపెద్ద బానపొట్టలేసు కొని లొట్టలేసుకుంటూ గడ్డి వెరైటీస్‌ని ఆర్డర్ చేస్తోన్న ఖరీదైన వ్యక్తుల్ని చూపిస్తూ, "నగరంలో నానాగడ్డి తిని సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని ఈ స్టాల్లో ఖర్చుపెట్టి గడ్డి ఋణం తీర్చుకోడానికి వచ్చినట్లున్నారు మహానుభావులు," అన్నాడు సూనా నవ్వుతూ వ్యంగ్యంగా.

నేను కూడా భోజనప్రియుడ్నే అయినప్పటికీ ఈ ఫెస్టివల్‌కి రావడం పట్ల నా ఉద్దేశం వేరే కాబట్టి- తక్కువ టైంలోనే ఎక్కువ స్టాల్స్ విజిట్ చేసి వీలైనన్ని ఎక్కువ వంటకాల పేర్లను లిస్ట్‌లాగా రాసుకోవడం మీదే దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను.

సూనా మాత్రం సుదూర తీరం నుండి వీస్తోన్న రొయ్యల పులుసు వాసనకి స్పృహ తప్పినవాడై- అరి పాదాల మీద లేచి నిలబడి అటూఇటూ చూసి-

"అదివో... అల్లదివో శ్రీ రొయ్య వాసనా," అని పాడుతూ, "రేయ్... అక్కడ కనిపిస్తోన్న ఫిష్ వెరైటీస్ స్టాల్ దగ్గర ఏ గంగరొయ్యకో వేలాడుతుంటాను. నీ లిస్టంతా రాసుకున్నాక చివర్లో అటొచ్చెయ్..." అని అటు వైపు బయలుదేరాడు. రొయ్యంటే వాడు 'ప్రాన్'ం పెడతాడు.

కేవలం మూడుస్టాళ్లలో ఉన్న వంటకాల లిస్ట్ రాసుకునేసరికే రాత్రి పన్నెండు దాటింది. అన్నిరకాల వెరైటీస్‌ని పెట్టారు ఒక్కో స్టాల్లో.

సూనాతో కలిసి జింఖానా గ్రౌండ్స్ నుండి బయలుదేరి వాడి గదికి చేరుకునే సరికి తెల్లారింది.

*

రాత్రి సూనా తిన్న రొయ్యల పులుసులో ఎక్కడ బెడిసికొట్టిందో కానీ గదిలో అడుగుపెట్టినప్పటి నుండీ వాడికి విరోచనాలు పట్టుకున్నాయి. మధ్యాహ్నం టాబ్లెట్ వేసుకున్నా కూడా సాయంత్రానికిగానీ మామూలు స్థితికి రాలేకపోయాడు.

"రేయ్... ఈరోజు ఫుడ్ ఫెస్టివల్‌కి రావడం నావల్ల కాదుగానీ నువ్వొక్కడివే వెళ్లిరా. రాకరాక వచ్చావు. ఈ రాత్రి 'స్కాచి' వడబోద్దామనుకున్నాను. కానీ విరోచనాల దెబ్బకి నీళ్లను కాచి వడబోసి తాగాల్సిన పరిస్థితొచ్చింది. ఒప్పుకుంటావో లేదో కానీ- జీవిత సత్యాన్ని తెలిపే ఆ పదార్థం నా దృష్టిలో 'రొయ్యల పులుసే'నని ఇవ్వాళ అనుభవపూర్వకంగా తెలుసుకున్నాన్రా. ఈ వేడుకని పురస్కరించుకొని జాతికి నేనిచ్చే సందేశం ఒక్కటే- పులుసు విషయంలో ఎక్కువ కక్కుర్తి పడకండి. రంగు పడుద్ది," అని వాడి స్టయిల్లో పెద్ద పెట్టున నవ్వడానికి ప్రయత్నించాడు. వాడినట్లా నీరసంగా ఒదిలి నాకు ఫెస్టివల్‌కి వెళ్లబుద్ధి కాలేదు. 'ఇంకా రెండ్రోజులుం

టానుగా... చూద్దాంలే,' అనుకొని ఆ సాయంత్రం వాడి గదిలోనే ఉండిపోయి వాడితో చిన్ననాటి ముచ్చట్లన్నీ పంచుకున్నాను.

మర్నాడు సాయంత్రం మళ్లీ సూనాతో కల్సి ఫుడ్ ఫెస్టివల్‌కి వెళ్లాను. అయితే ఈసారి వాడు ఫిష్ వెరైటీస్ స్టాల్ వైపు మాత్రం వెళ్లకుండా జాగ్రత్తపడ్డాను. అట్లా ఆరోజూ, మరునటి రోజూ అటెండయి దాదాపు రెండొందల రకాల పదార్థాల పేర్లను రాసుకొచ్చి పొద్దుట నుండి సాయంత్రం వరకూ వాడి రూంలోనే కూర్చొని-

ఆ పదార్థాల్లో- జీవిత సత్యాన్ని తెలిపే- 'ఆ' పదార్థమేదైనా దొరుకుతుందేమోనని వెదుకుతూ గడిపాను. కానీ ఒక్క పదార్థంలోనూ నాకు సంతృప్తి కలిగించే 'ఆ' లక్షణాలు కనిపించలేదు. దానిపట్ల ఆసక్తి మాత్రం పెరగసాగింది. నాలుగురోజులు హైదరాబాద్ టూర్ అనుకుంది మరో నాలుగురోజులు పొడిగించ బడింది. రిజర్వేషన్ చేయించుకునే అలవాటు లేదు కాబట్టి టికెట్ క్యాన్సిలేషన్ ఇబ్బందేం లేదు. అయితే నాకు ఐమాక్స్ సినిమానో, ప్యారడైజ్ బిర్యానీనో, బ్లూసీ చాయ్‌నో విందు చేయాలని తాపత్రయపడుతోన్న సూనా మాత్రం నేను ఈ పదార్థాన్వేషణలో పడి గదిలోనే ఎక్కువసేపు గడుపుతుండడాన్ని చూసి దీనికి ఫుల్‌స్టాపో కనీసం కామానైనా పెట్టాలనో నిశ్చయించుకున్నట్లు న్నాడు.

ఆరోజు ఎప్పటిలానే నిన్న రాత్రి ఫెస్టివల్ నుండి రాసుకొచ్చిన పదార్థాల లిస్ట్ ముందు పెట్టుకొని ఒక్కొక్క పదార్థాన్ని నాలో నేనే గొణుక్కుంటున్నట్లు పైకి చదువుతూ ఉన్నాను. ఇవాళ ఆ పదార్థం సంగతి తేల్చే యాలనుకున్నాడో ఏమో- నేను 'కాకరకాయ' అనగానే-

''జీవితమంతా చేదుమయమే కదరా- నువ్వు వెదుకుతున్న పదార్థం కాకరకాయేననుకుంటా- ఆలోచించు,'' అని-

నేను, 'ఉల్లిపాయ పులుసు,' అని చదవగానే-

''ఉల్లిపాయ కోసినవారికి కన్నీళ్లు తెప్పిస్తుంది. మనిషి ఏడుస్తూనే పుడతాడు. పోయి ఏడిపిస్తాడు. కాబట్టి కన్నీళ్లు తెప్పించే ఉల్లిపాయే నీ పదార్థమేమో ఆలోచించు,'' అని-

నేను 'బెండకాయ పులుసు,' అని చదవగానే-

''మనం పరిస్థితులకి ఎప్పుడూ 'బెండ్' అయి ఉంటాం కాబట్టి ఆ పదార్థం బెండ్ కాయ అయ్ మీన్ బెండకాయేమోరా...'' అన్నాడు.

''నువ్వింక మూసుకోకపోతే నీ బెండ్ తీస్తాను నా కొడకా,'' అన్నాను లిస్ట్ పక్కనపెట్టి చిరాగ్గా.

వాడు మూసుకున్నాడు ముసిముసిగా నవ్వు కుంటూ.

మళ్లీ కుస్తీ పట్టడం ప్రారంభించాను లిస్ట్ చేతిలోకి తీసుకొని.

ఎందుకో- ఏ పదార్థంలోనూ నేను ఎదురు చూస్తోన్న ఆ పదార్థం కనిపించలేదు. ఇదంతా వృథా ప్రయత్నమేమో- దొరకని దాని కోసం నా టైం అంతా వేస్ట్ చేసుకుంటున్నానేమో అనిపించింది.

మళ్లీ-

'ఎలాగూ వారం రోజులు ప్రయత్నించావు. ఇంకో వారం ప్రయత్నిస్తే... ఏమో దొరుకుతుందేమో...! ఇలాంటి ఫుడ్‌ఫెస్టివల్స్ మళ్లీ వస్తాయో లేదో ఆలో చించు,' అని కూడా అనిపించింది.

దేన్నయినా మొదలుపెడితే దాని అంతు చూసే దాకా వదిలిపెట్టని నా మనస్తత్వం ఇంకో వారంరోజులు ఇక్కడే ఉండి- దీనంతు తేల్చుకునే హైదరాబాద్ నుండి బయటికి కదులుతాను- అని నిశ్చయించుకుంది.

వారం కాస్తా నెలయింది. ఫుడ్‌ఫెస్టివల్ కూడా అయిపోయింది. ఫలితం మాత్రం శూన్యం.

ఈ పదార్థం ధ్యాసలోపడి చివరి రెండువారాల్లో అయితే భువనేశ్వర్ టూర్‌ని మర్చిపోయాను. ఎందుకు డిస్టర్బ్ చేయాలనుకున్నాడో ఏమో సూనా కూడా నా తీవ్రత చూసి ఆ టూర్ విషయమే ప్రస్తావించలేదు.

ఇక లాభం లేదు. రెంటికీ చెడ్డ రేవడి కాకూడదు. ప్రస్తుతానికి పదార్థాన్వేషణ పక్కనపెట్టి- ఈ సమ్మర్ టూర్ ముఖ్యోద్దేశం అయిన 'శూన్యారాధన యోగుల'పై ఇక పూర్తిగా దృష్టి సారించాలని గట్టిగా నిర్ణయించుకొని మర్నాడు భువనేశ్వర్ బయలుదేరుదామనుకుంటుం డగా జరిగిందా సంఘటన.

ఎవ్వరికి చెప్పినా నమ్మరు. పైగా నవ్విపోతారు. అందుకేనేమో 'నమ్మలేని నిజం' అనే వాక్యం పుట్టి ఉంటుంది. సూనా కూడా ఆ సంఘటనకి ప్రత్యక్షసాక్షి కాబట్టి నమ్మక తప్పలేదు కానీ- వాడు కూడా ఈ కో- ఇన్సిడెన్స్‌ని చెబితే నమ్మి ఉండేవాడుకాదు. సాయంత్రం ట్రైన్‌కి బయలుదేరబోతున్నా. ఆరోజు ఉదయం సూనా కలిపిచ్చిన కాఫీ తాగుతూ న్యూస్ పేపర్ తిరగేస్తున్న నాకు- మళ్లీ దిమ్మతిరిగిపోయే వార్త ఒకటి పేపర్లో కని పించింది-

''నేటి నుండీ దేశ రాజధాని ఢిల్లీలో ఫిరోజ్‌షా కోట్ల మైదానంలో ఏడాదిపాటు ఇంటర్నేషనల్ ఫుడ్ ఫెస్టి వల్...లక్షకుపైగా స్టాళ్లు... పదికోట్లరకాల వంటకాలు...''

ఫినిష్...

అయిపోయాను...

మళ్లీ వచ్చింది గొరై...

'ఈ పదార్థం ఇప్పట్లో నన్ను వదిలిపెట్టేలా లేదు మొర్రో,' అనుకున్నాను. అరె! నిన్ననే దీని గొడవ పక్కన పెట్టి- భువనేశ్వర్ బయలుదేరుదాం అనుకున్నానో లేదో- మళ్లీ ఈసారి న్యూస్‌పేపర్ ద్వారా టెంప్ట్ చేస్తూ-

'ఈసారి ఈ మాయావి వలలో పడకూడదు. ఢిల్లీకి వెళ్లడం అనే తెలివితక్కువ నిర్ణయం తీసుకోకూడదు. కంట్రోల్ యువర్‌సెల్ఫ్,' అనుకున్నాను.

ఎప్పుడైతే కంట్రోల్ అనుకున్నానో అప్పటినుండే నా మనసు కంట్రోల్ తప్పి పరిపరివిధాలా ఆలోచించడం మొదలుపెట్టసాగింది.

ఏది తెలివితక్కువతనం...? ఏది తెలివైనతనం...? ఢిల్లీకి వెళ్తేనే కానీ తెలియదు.. దొరక్కపోతే తెలివితక్కువ పని... దొరికితే...?

మానవ జీవిత అత్యంత విషాదకర విషయాల్లో ఒకటేమిటంటే-

వర్తమానంలో మనం చేస్తున్న అనేక పనులన్నీ తెలివైనవో కావో, గొప్పవో కావో, మంచివో కావో- చాలా వరకు మనకు అర్థమయ్యేది భవిష్యత్‌లోనే. కొందరు ఆ భవిష్యత్ కాలపు సంతృప్తిపడబోయే క్షణాల్నో, పశ్చాత్తాపబడబోయే క్షణాల్నో ఇప్పుడే తల్చుకొని... ఊహించుకొని... భయపడి. ఇష్టమున్నా లేకపోయినా వర్తమానంలో కొన్ని పనులు చేయడానికి సిద్ధపడతారు.

నేనూ అలానే సిద్ధపడ్డాను.

భువనేశ్వర్ వెళ్లడానికి కాదు. ఢిల్లీ వెళ్లడానికి. 'ఢిల్లీ ఫుడ్‌ఫెస్టివల్‌కి వెళ్లకుండా తప్పు చేసానేమో...' అని భవిష్యత్‌లో ఒక్కసారి కూడా బాధపడకూడదు అనుకొని- ఆ భవిష్యత్ వికృత క్షణాల్ని అలా ఊహించుకొని సిద్ధపడ్డాను.

నాకు వీడ్కోలివ్వడానికి సూనా రైల్వేస్టేషన్ దాకా వచ్చాడు.

"మిత్రమా! ప్రతీ పదార్థానికి ఓ ప్రతిపదార్థం ఉంటుంది... పదార్థం ద్వారానే నీ జీవితానికో అర్థం... పరమార్థం లభించాలని నా ఆశ దోశ- అప్పడం వడ వగైరా..." అని వాడి చమత్కారంతో వీడ్కోలిచ్చాడు.

*

ఢిల్లీలో తెలుగువాళ్లు నిర్వహించే సదరన్ హోటల్లో దిగాను. ఇంటి నుండి బయలుదేరి నెల దాటింది. హైదరాబాద్‌లో ఉన్నట్లు ఇక్కడ ఎక్కువ రోజులు ఉండకూడదు. మాగ్జిమం ఓ వారంరోజుల్లో ఆ పదార్థం అంతు తేల్చుకొని ఇట్నుండిటే భువనేశ్వర్ అడవులకెళ్లి శూన్యారాధన యోగుల బృందాన్ని కలుసుకుంటే ఈ వేసవి యాత్ర పూర్తయినట్లే అనుకున్నాను.

కానీ-

ఏదీ ఎవరి చేతుల్లో లేనట్లుగా- ఢిల్లీలో కూడా హైదరాబాద్ మాయే రిపీటైంది. రోజూ సాయంత్రం ఫుడ్ ఫెస్టివల్‌కి వెళ్లి రకరకాల పులుసుల లిస్ట్ తీసుకొని హుషారుగా హోటల్‌కి రావడం- రాత్రింబవళ్లు కూర్చొని కుస్తీ పట్టీపట్టీ- ఎందులోనూ నాకు కావలసింది దొరక్కనిట్టూర్చడం.

ఇక లాభంలేదు అనుకొని-

చివరిసారిగా రేపొక్కరోజు ప్రయత్నించి- ఆ పదార్థం దొరికినా దొరక్కపోయినా ఇంకేం ఆలోచించకుండా భువనేశ్వర్ రైలెక్కేయాలి అని గట్టిగా నిర్ణయించుకొని మర్నాడు ఫెస్టివల్‌కి వెళ్లాను.

ఇంటర్నేషనల్ ఫుడ్ ఫెస్టివల్ కదా... ఇండియన్ డిషెస్‌తోపాటు లక్షలరకాల వెస్ట్రన్ వంటకాలన్నింటినీ చూస్తోంటే- ఫుడ్ ఫెస్టివల్లో ఇదే నా ఆఖరి రోజా? అని తల్చుకుంటే దిగులేసింది.

అంత దిగుల్లోనూ నన్ను బాగా ఆకట్టుకున్న స్టాలొకటి కనిపించింది. ఆ స్టాల్ పైభాగంలో 'ఫిలాసఫర్స్ స్పెషల్' అన్న బోర్డు చూసి, 'అరె భలే గమ్మత్తుగా ఉందే,' అనుకొని వడివడిగా ఆ స్టాల్‌వైపు అడుగులేసి అక్కడ ఏ పదార్థాలు ఎగ్జిబిట్ చేశారోనని ఆత్రంగా తొంగిచూద్దును కదా... విస్మయం చెందాను- అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి...

ఆ స్టాల్లో కొన్ని వందల మట్టికుండల్లో నీళ్లు నింపబడి ఉన్నాయి. అదొక చలివేంద్రం స్టాల్.

ఆ స్టాల్‌కి వచ్చిన వాళ్లందరికీ చల్లని నీళ్లు పోస్తున్నారు అక్కడి సిబ్బంది. ఇదేనా 'ఫిలాసఫర్స్ స్పెషల్' అనుకున్నాను. దీనికి ఆ పేరెందుకు పెట్టారో అర్థం కాలేదు. ఎవర్నో అడిగితే అది ఇండియన్ స్టాల్ అనీ, వారణాసి యూనివర్శిటీ ఫిలాసఫీ డిపార్ట్‌మెంట్‌వాళ్లు ఏర్పాటుచేసిన స్టాల్ అనీ చెప్పారు.

అప్పుడర్థమైంది. పుణ్యక్షేత్రమే కాకుండా అంత్యక్రియల విశ్వాసానికి కాశీ ప్రసిద్ధి చెందిందనీ, అంత్యక్రియల్లో పగలగొట్టే కుండని సింబాలిక్‌గా తీసుకొని ఇక్కడ 'ఫిలాసఫర్స్ స్పెషల్' అనే కౌంటర్ ఓపెన్ చేసి కుండల్లో నీళ్లు అందించడం అనే పనికి పూనుకొని వుంటారని. అయితే 'స్పిరిట్యుయల్స్ స్పెషల్' అనో 'కల్చరల్ స్పెషల్' అనో పెట్టాలికానీ 'ఫిలాసఫర్స్

స్పెషల్ అని పేరెందుకు పెట్టారో...? బహుశా తత్వ వేత్తలు మాత్రమే మృత్యువు గురించిన సత్యాన్ని భయం కలిగించకుండా చెప్పగలరు కాబట్టి ఫిలాసఫర్స్ స్పెషల్ అన్న పేరెన్నుకుని ఉండొచ్చా? తెలీదు...

ఏదేమైనా వాళ్ల సృజనాత్మకతకి జోహార్లర్పించి నేను కూడా గ్లాసెడు తాత్విక నీళ్లు తాగి- ఆ గ్రౌండ్‌లో ప్రయాణాన్ని తిరిగి కొనసాగించాను.

ఇదే చివరిరోజు అనుకున్నాను కాబట్టి ఒక్క నిమిషం కూడా వృధా చేయకుండా వీలైనన్ని ఎక్కువ స్టాళ్లు అటెండ్ కావాలని చకచకా అడుగులు వేసాను. కానీ అదొక మహాసముద్రం... రోజురోజుకీ కొత్తకొత్త వంటకాలను పరిచయం చేస్తున్నారు... 'సముద్రంలోని నీళ్లను దోసిళ్లతో కొలవాలనుకుంటున్నానా...?' అనిపించింది. ఈ ఆలోచన ఇంకొక్కరోజు ఉండి చూస్తే పోలా...? అనుకోడానికి మళ్లీ దోహదం చేసింది. ఇంకేం... అట్లా ఇంకోరోజు... మరోరోజు... ఇదే చివరి రోజు అనుకుంటుండగానే- లెక్కపెట్టుకోకుండానే ఢిల్లీలో మరో నెలరోజులు గడిచిపోయాయి. ఏటీయం లోంచి మినిమం బ్యాలెన్స్ ఉంచి డ్రా చేసిన డబ్బులు కూడా దాదాపు అయిపోయే స్థితికి వచ్చాయి. మిగతా హోటల్ బిల్ పే చేయడానికి, తిరుగు ప్రయాణ ఛార్జీలకు పక్కనపెట్టిన డబ్బులు మాత్రమే మిగిలాయి.

అ..యి..పో..యిం...ది...

నెలరోజులున్నా ఢిల్లీ ఫుడ్‌ఫెస్టివల్లోనూ ఆ పదార్థాన్నీ కనుక్కోలేకపోయాను. సమ్మర్ హాలిడేసన్నీ బూడిదలో పోసిన పన్నీర్ బటర్ మసాలా అయిపోయింది. ఈ టూర్ ఇట్లా వృధా అవుతుందనుకోలేదు.

భువనేశ్వర్ అడవుల టూర్ ఇక మళ్లీ వచ్చే వేసవి సెలవుల్లోనే.

ఎవడో అనామకుడు న్యూస్‌పేపర్లో రాసుకున్న పిచ్చిరాతల్ని (కడుపు మండుతోంది మరి...) చదివి... సత్యాన్వేషణ వ్యామోహంలో పడి ఢిల్లీ దాకా వచ్చాను. హైదరాబాద్ అనుభవంలోనే బుద్ధి తెచ్చుకొని- అట్నుంచటే భువనేశ్వర్ వెళ్తే సరిపోయేది. ఇప్పుడు మొత్తుకొని ఏంలాభం...? అయినా- ఆ మైదాపిండిని న్యూస్‌పేపర్లో పొట్లం కట్టిచ్చిన వీధి చివరి కిరాణాకొట్టు వాడ్ననాలి.

ఎవడ్నంటే ఏం లాభమిప్పుడు...? నిందించుకోవాలంటే నన్ను మించిన అర్హత గలవాడు మరొకడు లేడు. ఆమాటకొస్తే నన్నయినా నేను ఎందుకు నిందించుకోవాలి? ఇలా జరుగుతుందని ఊహించానా ఏంటి..? అయినా అప్పుడప్పుడూ నాకు నేనే గొప్పగా అనుకుంటుంటానుగా! 'ప్రయాణం ముఖ్యం బ్రదర్... గమ్యం కాదు,' అని- ఆ స్పృహ ఇప్పుడెక్కడికిపోయింది..? అప్పుడప్పుడూ అలాంటి స్పృహ కోల్పోతుండడమే ఇలాంటి నిస్పృహకు కారణమా...? అవుననిపించింది... నిందించుకుంటే. అలాంటి స్పృహను రక్తంలోకి ఇంకించుకోలేకపోయినందుకు నిందించుకోవాలని పించింది.

ఎప్పుడైతే గమ్యంకాదు-ప్రయాణించడంలోని కాంతి ముఖ్యమన్న స్పృహ మళ్లీ కలిగిందో నా మనసులోకి కొత్త ఉత్సాహమేదో ప్రవేశించినట్లయింది. మొత్తం ఈ ప్రయాణంలోని మధురస్మృతులన్నీ కళ్లముందు మెదిలాయి.

కొత్తగూడెం నుండి తెల్లవారుజామున బయలుదేరిన పాసింజర్ రైలు ప్రయాణ దృశ్యాలు... హైదరాబాద్‌లో సూనాతో వాడి భాషా విన్యాసాల అంత్యప్రాసల చమత్కారాలతో గడిచిన ఆ నెలరోజులూ, ఢిల్లీలో గడిపిన ఈ నెలరోజుల్లోని కొన్ని జ్ఞాపకాలు- ముఖ్యంగా 'ఫిలాసఫర్స్ స్పెషల్ స్టాల్' ఇవన్నీ గుర్తుకొచ్చి హుషారు కలిగింది.

'ఈ సమ్మర్ టూరేం వృధాకాలేదు లేవోయ్,' అనుకుంటూ ఈలపాట పాడుకుంటూ తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాను.

*

న్యూఢిల్లీ నుండి గ్రాండ్‌ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో రెండురోజులు ప్రయాణించి వరంగల్లో దిగి అక్కడ్నుంచి బస్‌లో కొత్తగూడెం చేరుకునేసరికి రాత్రి ఒంటి గంటయింది. వరంగల్లో సాయంత్రం చేసిన టిఫిన్ ఎప్పుడో అరిగిపోయింది. మహబూబాబాద్‌లో మీల్స్ కోసం బస్ ఆపినపుడు అక్కడే భోంచేసి ఉండాల్సింది. అప్పుడు ఆకలిగా లేదు. ఇప్పుడు దంచేస్తోంది.

శ్రీమతి పుట్టింటి నుండి వచ్చేది ఎల్లుండి కనుక స్టవ్‌మీది నుండి పిల్లి లేచేది ఎల్లుండే.

అర్ధరాత్రి దాటింది కాబట్టి కొత్తగూడెంలో హోటళ్లన్నీ మూసేసి ఉంటారు. సుదీర్ఘమైన రైలూ, బస్సూ ప్రయాణంవల్ల తలనొప్పిగా కూడా ఉంది. దేహంలో కొంచెం టీ అయినా పడితే ప్రస్తుతం ప్రాణం కుదుటపడి ఆత్మ వెలిగే అవకాశం ఉంది అనుకుంటుండగా గుర్తుకొచ్చింది హోటల్ కా...స్మో...

ప్రాణం లేచొచ్చినట్లయింది. మా ఊళ్లో ఇరవై నాలుగ్గంటలూ తెరిచి ఉండే హోటల్ ఇదొక్కటే.

ఇంత రాత్రి సమయంలో కూడా టీ మాత్రమే కాకుండా బిర్యానీలు, తందూరి రోటీ, ఖుష్కా (ఫ్రైడ్ రైస్)లు కూడా దొరికే ఏకైక హోటల్ ఇది.

'బ్రతుకుజీవుడా,' అనుకుంటూ కాస్మో హోటల్‌కి దగ్గర్లోనే ఉన్న సూపర్‌బజార్ బస్టాపులోనే బస్ దిగి హోటల్ చేరుకున్నాను.

హోటల్లోకి అడుగుపెడుతుండగా- అప్పుడు గుర్తొచ్చాడు... చీచా.

రెన్నెళ్ల క్రితం ఈ సమ్మర్ టూర్ మొదలైన ఉదయం ఇదే హోటల్లో తన రొటీన్ హుషారు వదనానికి భిన్నంగా విచార వదనంతో నాకు డికాక్షన్ తెచ్చిచ్చిన చీచా పీక్కుపోయిన ముఖం గుర్తుకొచ్చింది.

అవును, మర్చేపోయాను. అతని మనవరాలి హార్ట్ సర్జరీ ఎలా జరిగిందో...? హైదరాబాద్‌లో ఒకటీ రెండు సార్లు గుర్తుకొచ్చాడు కానీ ఆ తర్వాత ఫుడ్‌ఫెస్టివల్లో పూర్తిగా లీనమైపోయి అతడి మనవరాలి అనారోగ్యం విషయమే మర్చిపోయాను.

ఆమెకు ఇప్పుడెలా ఉందో చీచా నడిగి తెలుసుకోవాలి. అతనసలు ఈరోజు డ్యూటీకి వచ్చాడో లేదో...?

హోటల్లోకి అడుగుపెట్టగానే అతనికోసం వెదికాయి నా కళ్లు. చీచా కనిపించలేదు. వేరే ఇద్దరు సర్వర్లు బిర్యానీలు తెస్తూ, బిల్ కలెక్ట్ చేస్తూ కనిపించారు.

నేను కూర్చున్నాక నా టేబుల్ దగ్గరికొచ్చిన సర్వర్‌తో, "చీచా వస్తున్నాడా డ్యూటీకి...?" అనడిగాను.

"వస్తున్నాడుగా... ఇంతకుముందే డ్యూటీ దిగి లోపల భోంచేస్తున్నాడు. ఏం చెప్పమంటారు మీకు... బిర్యానీ అయిపోయింది. ఓన్లీ తందూరి రోటీ," అన్నాడతను హిందీలో.

"నాలుగు తందూరీ రోటీ పట్రా... భోజనం అయ్యాక చీచాని ఒకసారి నా దగ్గరికి రమ్మని చెప్పు... ఫ్రెండ్ అని చెప్పు..." అన్నానతనితో.

అలా అన్న తర్వాత ఎందుకో గిల్టీగా అనిపించింది. నిజంగా నేనతనికి ఫ్రెండ్‌నే అయితే- ఆరోజు ఉదయం చీచా తన మనవరాలి అనారోగ్యం గురించి చెప్పినపుడు అతని చేతిలో నాలుగు పచ్చనోట్లు పెట్టడంతో మాత్రమే సరిపుచ్చకుండా కనీసం అతడు పుట్టపర్తికి వెళ్లేదాకానైనా అతడితోపాటుండి ధైర్యంచెప్పి- తన టూర్‌ని రెండ్రోజుల తర్వాత మొదలుపెట్టుకుని ఉండాల్సింది...

అప్పుడు నా టూర్ నాకు ఇంపార్టెంట్ అనిపించింది. 'నేను' అనే ఇగో ముందు అన్ని మానవ సంబంధాలూ ఎందుకూ పనికిరాని అందమైన పదాలే- అనిపించింది.

ఎందుకో ఎదురుగా అద్దం లేకపోయినా నా ముఖం నాకే వికారంగా అనిపించిందో క్షణం...

లేచి వాష్‌బేసిన్ దగ్గరికెళ్లి ముఖం, చేతులూ కడుక్కొనొచ్చి కూర్చొని- చెప్పులు విడచి- రిలాక్స్‌గా భుజాల పక్క నుండి రెండు చేతులూ చాపి బల్ల పై భాగంలో ఆనించి ఒక్కసారి హోటల్ పరిసరాలనంతా పరికించి చూశాను.

పొగచూరిన స్పీకర్లోంచి సల్మా ఆగా పాట 'దిల్ కె అర్‌మా...' బిర్యానీలో ఉడికిన మాంసం వాసనతో కలిసి నాలుగువైపులకీ విస్తరిస్తోంది.

ఒక టేబుల్ దగ్గర పీకల్దాకా తాగినట్టున్న వ్యక్తి తన మిత్రుడివైపు చూస్తూ ఎవడ్నో బూతులు తిడుతున్నాడు- మధ్యమధ్యలో చికెన్ లెగ్‌పీస్ అంతు చూస్తూ.

మరో టేబుల్ దగ్గర యూనిఫాంలో ఉన్న ఆటో డ్రైవర్లు నలుగురు జోకులు వేసుకుంటూ పగలబడి నవ్వుతూ రొట్టెలు తింటున్నారు సూప్‌లో నంజుకుంటూ...

ఇంకో టేబుల్ దగ్గర టీకప్పుల, సిగరెట్ సిప్పుల జుగల్‌బందీ జరుగుతోంది.

మొత్తానికి బిర్యానీ, మటన్ చికెన్ కర్రీ, తందూరీ రోటీ, సూప్, టీల వాసన కలగలిసిపోయిన ఒక ముదురువాసన ఆ హోటల్ ఆత్మను భౌతికంగా ఆక్రమించుకుంది.

బయట ఉక్కపోతనీ, వేడిగాలుల నిట్టూర్పుల్నీ దాటి గాఢనిద్రలోకి జారిపోతోన్న లోకానికి భిన్నంగా- ఇక్కడ ట్యూబ్‌లైట్ల కాంతిలో, ప్లేట్ల శబ్దాలతో సందడిగా ఉన్న ఈ మరోలోకంలో అట్లా కాసేపు గడిపాను.

కాసేపటికి ప్లేట్లో తందూరి రొట్టెలు, సూప్ తీసుకొచ్చి నాముందు పెట్టి వెళ్లిపోయాడా సర్వర్.

ఆకలి దంచేస్తోంది... తినడం మొదలుపెట్టాను.

చివరి రొట్టె సగం తిన్నాక- ఎవరో నావైపు వస్తున్నట్లనిపించి తలెత్తి చూసాను. చీచా...!

కిచెన్లోంచి నడుచుకుంటూ నావైపే వస్తున్నాడు.

నేను తలెత్తి తనవైపు చూడగానే- నావైపు చూసి అతడి స్టయిల్లో నవ్వాడు... అమ్మయ్య! చీచా నవ్వుతున్నాడు. అంటే- తన మనవరాలి ఆరోగ్యం కుదుటపడి ఉంటుంది.

నేను ఈ టూర్ మొదలు పెట్టినపుడు ఆ ఉదయం- అతడి ముఖంలో కనిపించిన విచారఛాయ లేవీ ఇప్పుడు లేవు-

హుషారుగా నా దగ్గరికొచ్చి-

''ఏంటీ... అప్పుడు బయలుదేరిన టూర్ నుండే వస్తున్నావా? అంతా క్షేమమేగా...'' అని నా ప్లేట్ వైపు చూసి-

''ఇంతకుముందే బిర్యానీ అయిపోయింది. ఇంకో రెండు రోటీ పత్రానా...?'' అన్నాడు.

''వద్దులే... సరిపోయింది... ముందు నువ్వు కూర్చో... సరేకానీ- నీ మనవరాలికి ఇప్పుడెలా ఉంది...? పుట్టపర్తి వెళ్లొచ్చారా...?'' అనడిగాను రొట్టెను సూప్‌లో ముంచి నోట్లో పెట్టుకొని ఉల్లిపాయముక్కని చేతిలోకి తీసుకుంటూ.

చీచా నా ఎదురుగా ఖాళీగా ఉన్న బల్లమీద కూర్చొని- ''వెళ్లొచ్చాం... ఇప్పుడు నువ్విట్లా తింటుం డడం చూస్తోంటే- రేపుదయం పుట్టపర్తికి చేరుకుంటా మనగా.. రాత్రి... అనంతపురం రైల్వేస్టేషన్లో నిద్రపోయే ముందు నా మనవరాలు స్వప్న చెప్పిన పొడుపు కథ గుర్తుకొస్తోంది. నీకు చాలాసార్లు చెప్పే ఉంటాను... అది కొత్త కొత్త పొడుపు కథల్ని సొంతంగా అల్లి... గమ్మత్తుగా చెప్పి మమ్మల్ని విప్పమంటుందని... ఆరోజు రాత్రి అలాంటి పొడుపు కథే ఒకటి చెప్పి విప్పమంది...'' అని చీచా ఏదో గుర్తు చేసుకుంటున్నట్లుగా ఎటో చూసి-

''అదేందది... ఆ... పుట్టుకకి ఇంకో పేరేంటి... జ...న్మ... ఆ...జన్మ! అనేక జన్మల్ని కప్పుకొని నిద్రపోతూ ఉంటుంది...! దాని ఒక్కో జన్మ కథనీ తెలుసుకుంటూ పోతే మనల్ని కంటనీరు పెట్టిస్తుంది... అన్ని జన్మల కతల్ని తెలుసుకున్నాక దానివైపు చూస్తే... అక్కడేం కనిపించదు. అంతా శూన్యం... ఏమిటది...? అని పొడుపుకథ వేసింది.

''తెలియదమ్మా... అన్నాం మేం... ఒకవేళ తెలిసినా దాని ఆనందం కోసం ఓడిపోవడానికే సిద్ధంగా ఉన్నాం మేం... గుండె ఆపరేషన్ చేయించుకోబోతున్న బిడ్డ కదా...

''అది మా అందరి ముఖాల్లోకి ఒకసారి చూసి- 'చెప్పేస్తున్నా... ఉ...ల్లి... పా...యి...! దాని ఒక్కొక్క పొరనీ విప్పి చూస్తే చివరికి కనిపించేది శూన్యమే కదా తాతయ్యా...' అని నవ్వింది నా తల్లి,'' చీచా చెప్పుకు పోతున్నాడు.

వింటున్న నాకు చప్పున ఏదో స్ఫురించింది. అట్లా స్ఫురించడం... క్షణంలోనే పొలమారడం- రెండూ వెంటవెంటనే జరిగిపోయాయి.... అప్పటికే నోట్లో పెట్టుకొని రొట్టెతోపాటు కొరకబోతున్న ఉల్లిపాయ ముక్క- ఒక్కసారిగా పొలమారడంతో- నోట్లోంచి ఎగిరి నా ముందున్న ప్లేట్లో పడింది...

పెద్దగా దగ్గాను... కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి... ముక్కులోంచి నీళ్లలాగా చీమిడి కారింది... చీచా కంగారుగా లేచి నీళ్లగ్లాసు అందివ్వబోయాడు. నేను ఎడమ అరిచేత్తో నడినెత్తి మీద ఒకటికి రెండుసార్లు తడుముకొని- అతడందించిన గ్లాసు తీసుకొని- నీళ్లు తాగి... గొంతులో ఊరిన మంటను సవరించుకోడానికి 'హ్హా... హ్హా...' అని చిన్నగా హుంకరించి... మళ్లీ నీళ్లు తాగాను...

''ఎవరో గుర్తు చేసుకుంటున్నట్లున్నారు... స్వరం తప్పింది...'' చీచా ఏదో అనబోతున్నాడు... అవేమీ నాకు వినిపించడంలేదు. హఠాత్తుగా నా తలలో ఏదో మెరుపు మెరిసిపోయిన ఆ స్థితిలోనే అలా ఉండిపోయాను.

ఉల్లిపాయ... ఒక్కొక్క పొరని విప్పిచూస్తే చివరికి శూన్యం... తత్వం... సత్యం... జీవితసత్యాన్ని తెలిపే పదార్థం... పులుసు... ఉల్లిపాయ పులుసు... జీవిత సత్యాన్ని తెలిపే 'ఆ' పదార్థంతో పులుసు వండుకొని-

''రేయ్... అయ్యా...! ఆకుపచ్చ అక్షరాలవాడా... ఎక్కడున్నావ్‌రా తండ్రీ...? తెలుసుకున్నావ్రా నాయనా... తెలిసిందిరా... రెన్నెళ్ల నుండి... ఎవరికి చెబితే నవ్వుతారో నని- ఒక్క సూనాకి తప్ప... ఎవ్వరికీ చెప్పకుండా... పిచ్చి పట్టినట్లు... హైదరాబాద్‌లో... ఢిల్లీలో ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లలో వెదికీ... వెదికీ కనుక్కోలేకపోయిన నీ పదార్థం... ఇక్కడ దొరికిందయ్యా... ఇంత చిన్న హోటల్లో... ఈ అర్ధరాత్రి దొరికిందయ్యా... ఉల్లిపాయ కదరా నాయనా అది... ఉల్లిపాయే కదా... దాన్నిమించిన జీవిత సత్యాన్ని తెలిపే పదార్థం లోకంలో ఇంకేముంటుంది స్వామీ...''

ఎన్ని మాటల్ని లోపల అనుకున్నానో- ఎన్ని బయటికి అన్నానో నాకే తెలియదు. నా పెదవుల మీదకు చిరునవ్వు ప్రవేశించింది. రెన్నెళ్ల ప్రయాణ మంతా గుర్తుకొచ్చి కళ్లల్లో మళ్లీ నీళ్లు ఊరాయి. ఆ నీళ్లలోంచే చీచా వైపు చూసాను.

అతడు మాట్లాడడం ఆపేసి నోరు తెరిచి నావైపే చూస్తున్నాడు. అతడి అయోమయాన్ని పట్టించుకో కుండా- ఇదంతా చీచాకు కూడా తెలుసన్నట్లుగా- మళ్లీ కొనసాగిస్తూ-

''న్యూస్‌పేపర్లో అతడు రాసుకున్న వాక్యాలన్నీ నిజమే అయితే- అతడు ఈపాటికే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చు... జీవిత సత్యాన్ని తెలిపే 'ఆ' పదార్థంలో

('ఆ' అంటే- ఆనియన్ అని క్లూ కూడా ఇచ్చాడా మహానుభావుడు...?) పులుసు వండుకొని చివరిసారి తృప్తిగా భోంచేసి వెళ్లిపోయిన అతనికి... ఆ పదార్థం ఉల్లిపాయే కదా...? అని- దాన్ని నేనిట్లా చివరికి ఇక్కడ తెలుసుకున్నానని... ఎట్లా చెప్పాలి చీచా...?'' అన్నాను గద్గద స్వరంలో.

చీచా ఇంకా అయోమయంగానే చూస్తున్నాడు నావైపు... అతడి అయోమయం అర్థం అయ్యాక నేను మళ్లీ మామూలు స్థితిలోకి వచ్చేసాను.

''సారీ చీచా... కొన్ని రోజుల నుండి నేను వెదుకుతున్నది దొరికిందన్న ఆనందంలో నీకర్థం కాకుండా ఏదేదో మాట్లాడేశాను...'' అన్నాను.

చీచా నవ్వాడు. అతనికి నేను కొత్త కాదు... నా విషాదానంద భాష్పాలు కొత్తవి కావు... నా పండగ చేసుకోవడాలూ కొత్తవి కావు.

మళ్లీ నేనే సంభాషణ కొనసాగిస్తూ-

''నీ మనవరాలు గొప్ప పొడుపుకథ చెప్పింది చీచా... అదెంత గొప్ప పొడుపు కథంటే- నాకెంత మేలు చేసిందంటే-

''ఈ టైంలో ఎంత చెప్పినా నీకర్థంకాదు... రేపు రెండు స్వీటు పాకెట్లతో వచ్చి చెబుతాను. ఒక పాకెట్ నీకు- రెండోది నీ మనవరాలికి...'' అన్నాను హుషారుగా ప్లేట్లో చేతులు కడుక్కుంటూ....

''నువ్వు తెచ్చే స్వీట్లు నా మనవరాలు తినలేదు చోటా...'' అన్నాడు చీచా.

''ఎందుకోయ్... గుండె జబ్బు మళ్లీ రాకూడదంటే స్వీట్స్ తినొద్దని చెప్పారా ఏంటి పుట్టపర్తి డాక్టర్లు,'' అన్నాను నవ్వుతూ.

''నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు నువ్వు... ఆరోజు రాత్రి అనంతపురం రైల్వేస్టేషన్లో... ఆ పొడుపుకథ చెప్పి... దాన్ని విప్పలేకపోయిన మా అందరినీ ఆటపట్టించి... అలసిపోయి.... నా ఒళ్లోనే తలపెట్టుకొని నిద్రపోయిన నా తల్లి... తెల్లారాక... మళ్లీ నిద్రలేవలేదు.. దాని జన్మకదే ఆఖరి రాత్రి... ఆఖరి పొడుపుకథ కూడా...''

చీచా ఏం చెబుతున్నాడో నాకు అర్థం కాలేదు. అంతా అయోమయంగా అనిపించింది. ఇప్పటిదాకా జరిగిందంతా ఒక కల కాదుగా- అనిపించింది... అయితే ఇదంతా కలకాదు... నిజమే.

అసలు చీచా ఏం చెబుతున్నాడో స్పష్టంగా అర్థం చేసుకోడానికన్నట్లు మళ్లీ ఒకసారి అతడి ముఖంలోకి చూసాను.

అతడి ముఖం ప్రశాంతంగా ఉంది. కళ్లు దేన్నో 'ఆరాధిస్తున్న'వాడిలా నిర్మలంగా ఉన్నాయి.

అతడు శూన్యంలోకి చూస్తున్నవాడిలా చూసి... ఎందుకో... పసిపాప నవ్వులాంటి నవ్వు నవ్వి... నెమ్మదిగా నావైపు చూశాడు.

అది మతిభ్రమించిన పిచ్చివాడి నవ్వులాంటిది కాదు.

ఇన్ని సంవత్సరాల నా జీవితంలో అలాంటి దివ్యమైన నవ్వుని నేను ఇప్పటి దాకా ఎవ్వరి ముఖంలోనూ చూళ్లేదు.

*పాలపిట్ట, ఏప్రిల్ 2010*

